RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com
RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక
NITYAM NIGHA TELUGU DAILY
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal
Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 109 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | గురువారం | 22.10.2026 | పేజీలు : 8

సీఎంఆర్ఎల్ కేసు : పినరయి విజయన్ కుటుంబానికి సుప్రీంకోర్టులో ఊరట

- వారం రోజుల పాటు విచారణపై స్టే విధించిన సుప్రీంకోర్టు
- హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసుకునేందుకు అనుమతి
- ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయలేదని స్పష్టం చేసిన ధర్మాసనం



2

డ్రోన్ల ఆట కట్టించేందుకు ఆర్మీకి కొత్త రాడార్లు..
రూ.770 కోట్లతో ఒప్పందం

- భారత సైన్యం వైమానిక రక్షణ సామర్థ్యం పెంపే లక్ష్యం
- చిన్న, అతి చిన్న డ్రోన్లను గుర్తించి ట్రాక్ చేయగల రాడార్లు
- గగనతల లక్ష్యాలకు ప్రాధాన్యాన్ని నిర్ణయించే సాంకేతికత
- 2025-26లో రక్షణ ఉత్పత్తుల విలువ రూ.1.78 లక్షల కోట్లు



2

దసరా పండుగ వేళ బంధించిన
4 పాలపిట్టలకు విముక్తి : సీపీ సజ్జనార్

- హైదరాబాద్‌లో మూడు చోట్ల పోలీసుల దాడులు
- నిందితులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన సీపీ సజ్జనార్
- జీవకారుణ్యమే నిజమైన భక్తి అని ప్రజలకు పిలుపు
- వన్యప్రాణుల సంరక్షణకు సహకరించాలని విజ్ఞప్తి



2

2028 నాటికి పోలీస్ శాఖలో
ఖాళీలన్నీ భర్తీ
- సీఎం రేవంత్ రెడ్డి

- విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అమరుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా భారీగా పెంపు.
- 2026లో మరో 5 వేల పోలీస్ ఉద్యోగాల భర్తీకి అనుమతి.
- సైబర్ నేరాలు, డ్రగ్స్, కల్తీ ఆహారంపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టీకరణ.
- సామాన్యులతో ఫ్రెండ్లీ పోలీసింగ్, నేరస్థులపై కఠిన వైఖరి తప్పనిసరి.



నిత్యం నిఘా, హైదరాబాద్ : పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా హైదరాబాద్ గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో అమర వీరుల స్మూపం వద్ద నివాళులర్పించి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, విడతలవారీగా నియామకాలు చేపడుతూ 2028 నాటికి పోలీసు శాఖలో అన్ని ఖాళీలను భర్తీ చేసి సిబ్బంది కొరత లేకుండా చేస్తామని ప్రక టించారు. అమరుల త్యాగాలను గౌరవిస్తూ శాంతియుత, సురక్షిత, అభివృద్ధి చెందిన తెలం గాణను నిర్మిద్దామని పిలుపునిచ్చిన ఆయన, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, డ్రగ్స్ అక్రమ రవాణా, ఆహార కల్తీ వంటి సవాళ్లను ఎదుర్కోవ డానికి శాఖను బలోపేతం చేస్తున్నామని, రోడ్లు-భవనాలు మాత్రమే కాకుండా ప్రజలు నిర్భయంగా జీవించి శాంతిభద్రతలు ఉన్నప్పుడే పరిశ్రమలు, పెట్టుబడులు, ఐటీ, పర్యాటకం అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 154 మంది పోలీసులు విధి నిర్వ హణలో ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేస్తూ, అమరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటూ పిల్లల .....

2



ఇండియా కూటమి తప్పుడు ప్రచారాన్ని తిప్పికొడతాం
: బీజేపీ ఎంపీ కె. లక్ష్మణ్

- ఇండియా కూటమి తప్పుడు ప్రచారం చేస్తోందన్న బీజేపీ ఎంపీ లక్ష్మణ్
- న్యాయవ్యవస్థ, రాజ్యాంగ సంస్థల విశ్వస నీయతను దెబ్బతీస్తున్నారని ఆరోపణ
- అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు దేశవ్యాప్తంగా కార్యక్రమాలు

2

ఆందోళనలకు విరామం..
- సీజేపీ కీలక ప్రకటన



- దీపావళి వరకు ఆందోళనలు నిలిపివేయాలని కార్యకర్తలకు సీజేపీ పిలుపు
- పండుగను కుటుంబ సభ్యులతో జరుపుకోవాలని సూచన
- సీఈసీ రాజీనామా కోసం చేస్తున్న పోరాటాలపై కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయని వెల్లడి

నిత్యం నిఘా, న్యూ ఢిల్లీ : ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఆందోళనలను దీపావళి వరకు తాత్కాలికంగా విరమించాలని కాక్రోచ్ జ నతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభి జీత్ దీపేక్ తన మద్దతుదారులకు పిలుపు నిచ్చారు. పండుగ సమయంలో కార్యకర్త లు తమ కుటుంబ సభ్యులతో గడపాలని ఆయన సూచించారు. నిరసనల్లో పాల్గొం టున్న యువత క్షేమం పట్ల వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారని అభి జీత్ పేర్కొన్నారు. తన కుటుంబంతో పా టు, ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న పార్టీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్‌ల కుటుంబాలు కూడా ఆవేదనతో ఉన్నాయ ని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు.

జంతర్ మంతర్ కేసులో సీజేపీ నేతలకు ఊరట..
విడుదలకు కోర్టు ఆదేశాలు

- సీజేపీ నేతలు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాకు ఊరట
- విడుదలకు ఎస్ఈఎం కోర్టు ఆదేశాలు
- కస్టడీ పొడిగింపుపై హైకోర్టులో పిటిషన్ ఉపసంహరణ
- జంతర్ మంతర్ చోరబాటు కేసులో అరెస్టు



నిత్యం నిఘా, న్యూ ఢిల్లీ : జంతర్ మంతర్ చోరబాటు కేసులో అరెస్టయిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాకు ఊరట లభించింది. వారిని విడుదల చేయాలని ప్రత్యేక కార్యని ర్వాహక మేజిస్ట్రేట్ (ఎస్ఈఎం) కోర్టు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. గతంలో విధించిన జ్యుడీషియల్ కస్టడీ గడువు ముగి యడంతో పోలీసులు వారిని మండిర్ మార్గ్ పోలీస్ స్టేషన్ నుంచి ఎస్ఈఎం కోర్టు ముందు హాజరుపరిచారు. ఈ విచారణకు ముందు సీజేపీ న్యాయ వ్యవహారాల విభాగం అధిపతి రత్నా సింగ్ కూడా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అంతకుముందు తమ విడు దలను కోరుతూ ఎస్ఈఎం కోర్టు కస్టడీని పొడిగించడాన్ని సవాలు చేస్తూ దాస్, రంకా దాఖలు చేసిన పిటిషన్‌ను ఉపసంహరించు కునేందుకు ఢిల్లీ హైకోర్టు అనుమతించింది. అయితే కేసులోని అంశాలపై ఎలాంటి అభి ప్రాయాన్ని వ్యక్తం చేయలేదు. జస్టిస్ సుబ్రమ ణియం ప్రసాద్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం.. ముందుగా ఎస్ఈఎం కోర్టులో జరిగే విచారణ కోసం వేచి ఉండాలని, ఆ తర్వాత అవసరమైతే తగిన న్యాయపరమైన మార్గాన్ని ఎంచుకోవాలని వారి తరపు న్యాయవాదులకు సూచించింది. అక్కడే ఉప శమనం లభిస్తే హైకోర్టులో పిటిషన్‌పై విచారణ కొనసాగించాల్సిన అవసరం ఉండదని పేర్కొంది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో
రహస్యాల లీక్..
ఇద్దరు కీలక అధికారులపై విచారణ..!



- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఇద్దరు సీనియర్ అధికా రులపై విచారణ
- రహస్య వ్యాపార సమాచారం బయటకు చేరవేసినట్లు అనుమానాలు
- సమాచారం దుర్వినియోగంపై కొనసాగుతోన్న దర్యాప్తు
- విచారణ వివరాలను ఉన్నతాధికారులకు ఇప్పటికే వెల్లడి
- విచారణ పూర్తయ్యాక చర్యలు తీసుకుంటామని బ్యాంకు ప్రకటన

2

తెలంగాణకు బీసీ సీఎం.. కానీ ఇప్పుడే కాదు : మహేశ్ గౌడ్

- బీసీ వ్యక్తి సీఎం కావడానికి డెడ్‌లైన్ ఏమీ లేదన్న మహేశ్ గౌడ్
- రేవంత్ రెడ్డి పాలన 2039 వరకు కొన సాగుతుందని విశ్వాసం
- కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణకు బీసీ సీఎం సాధ్యమని వ్యాఖ్య



నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలం గాణకు బీసీ వర్గానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి కావడానికి ఎలాంటి గడువులు లేవని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఏదో ఒక రోజు కాంగ్రెస్ పార్టీ ద్వారానే బీసీ నేత ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరి పాలన, సంక్షేమ పథకాల అమలు అద్భుతంగా ఉందని మహేశ్ గౌడ్ ప్రశంసించారు. ఈ పనితీరుతో కాంగ్రెస్ ప్రభుత్వం 2034 వరకే కాదని, 2039 వరకు కూడా అధి కారంలో ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తల్లో ....

2

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

తెలంగాణకు బీసీ సీఎం..
కానీ ఇప్పుడే కాదు : మహేశ్ గౌడ్

మొదటిపేజీ తరువాయి.. భరోసా నింపేందుకే రేవంత్ రెడ్డి 2034 వరకు తానే సీఎంగా ఉంటానని చెప్పారని, అందులో తప్పేమీ లేదని అన్నారు. వచ్చే టర్మ్‌లో మళ్లీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయినా తమకు ఎలాంటి తొందర లేదని, భవిష్యత్తులో బీసీ నేతకు అవకాశం వస్తుందని పేర్కొన్నారు. బీసీ సీఎం నినాదం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచన అని మహేశ్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించలేమని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీ బీసీని ముఖ్యమంత్రిని చేయగలదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెద్దపీట వేసిందని గుర్తు చేశారు. కొండా సురేఖ విషయంలో ఆమె కుమార్తె సుస్మిత తొందరపడి వ్యవహరించారని ఆయన అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలంగా ఉందని, రాష్ట్రంలో బీజేపీకి భవిష్యత్తు లేదని అన్నారు.

2028 నాటికి పోలీస్ శాఖలో ఖాళీలన్నీ భర్తీ : సీఎం రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి.. చదువు, ఉద్యోగం, ఇంటి స్థలం, ఉచిత విద్య, వైద్యం, భద్రత సంక్షేమ నిధి నుంచి రూ. 16 లక్షలు, సంక్షేమ నిధి నుంచి రూ. 8 లక్షలు అందిస్తామని భరోసానిచ్చారు. పోలీసు శాఖలో 2025 అక్టోబర్ నాటికే దాదాపు 16 వేల మంది కానిస్టేబుళ్లు, ఎస్ఐలను నియమించామని, 2026లో మరో 5 వేల ఉద్యోగాల భర్తీకి అనుమతించామని, గతంలో ఎన్నడూ లేనివిధంగా 112 మంది డీఎస్పీలను, దేశంలోనే తొలిసారిగా ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించామని వివరించారు. అమరులైన కానిస్టేబుళ్లు, హెడ్-కానిస్టేబుళ్లు, ఏఎస్ఐల ఎక్స్‌గ్రేషియాను రూ. 1 కోటికి, ఎస్ఐలు, ఇన్‌స్పెక్టర్లకు రూ. 1.25 కోట్లకు, డీఎస్పీ, అడిషనల్ ఎస్పీలకు రూ. 1.50 కోట్లకు, ఎస్పీ, ఐపీఎస్ అధికారులకు రూ. 2 కోట్లకు పెంచడంతో పాటు, హోంగార్డుల ఎక్స్‌గ్రేషియాను రూ. 10 లక్షలకు పెంచాలని డీజీపీని ఆదేశించారు. హోంగార్డు నుంచి డీజీపీ స్థాయి వరకు సిబ్బంది పిల్లల చదువు కోసం రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో 44 ఎకరాల్లో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రారంభించామని, డ్రగ్స్ నియంత్రణలో తెలంగాణ ఈగల్ ఫోర్స్ పనితీరును అభినందిస్తూనే, కల్తీ ఆహార నిరోధానికి టీజీ సేఫ్ (TG SAFE), మహిళల భద్రతకు షీ-టీమ్స్, 'StandWithHer', 'స్పందన' బృందాలను నడుపుతున్నామని చెప్పారు. చివరగా, క్రమశిక్షణ, నిజాయితీ పోలీసులకు గౌరవమని, సమస్యలతో వచ్చే సామాన్యులతో ఫ్రెండ్లీ పోలీసింగ్ పాటిస్తూ క్రిమినల్స్‌పై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేసిన ఈ కార్యక్రమంలో డీజీపీ సీవీ ఆనంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొని అమరుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు.

ఇండియా కూటమి తప్పుడు ప్రచారాన్ని తిప్పికొడతాం : బీజేపీ ఎంపీ కె. లక్ష్మణ్

మొదటిపేజీ తరువాయి.. కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి కలిసి దేశవ్యాప్తంగా తప్పుడు ప్రచారం చేస్తూ, నిరసనల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ ఆరోపించారు. న్యాయస్థానాలు, రాజ్యాంగబద్ధ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీసేలా వారి చర్యలు ఉన్నాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ, రాహుల్ గాంధీ దేశ ప్రయోజనాల కంటే అధికారానికే ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడ్డారు. నిరసనల ముసుగులో చట్టాలను ఉల్లంఘించడం, నిరాధార ఆరోపణలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. విమర్శలు వాస్తవాల ఆధారంగా ఉండాలని, అశాంతి సృష్టించేందుకు విదేశీ నిధులు కూడా వస్తున్నాయని ఆరోపించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఎన్నికల సంఘం ఇప్పటికే స్పష్టత ఇచ్చిందని, ఎలాంటి ఆధారాలు లేకుండా లక్షలాది మంది ఓటర్లను జాబితాలో చేర్చాలని డిమాండ్ చేయడం సరికాదన్నారు. న్యాయవ్యవస్థపై ఒత్తిడి తెచ్చేలా యాత్రలు నిర్వహించడాన్ని కూడా ఆయన తప్పుపట్టారు. ఇండియా కూటమి అసత్య కథనాలను తిప్పికొట్టేందుకు బీజేపీ దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు లక్ష్మణ్ ప్రకటించారు. అక్టోబర్ 23 నుంచి నవంబర్ 5 వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఇందులో భాగంగా ప్రధాన నగరాల్లో బహిరంగ సభలు, మేధావులు-విద్యావంతులతో చర్చా గోష్టులు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 200 మందితో సమావేశాలు ఏర్పాటు చేస్తామని వివరించారు. దేశ భద్రత, అర్హులైన ఓటర్ల హక్కుల విషయంలో బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణతో పాటు జాతీయ స్థాయిలో ఎన్నికల ప్రక్రియ, ప్రతిపక్షాల నిరసనలపై రాజకీయ వివాదాలు కొనసాగుతున్న నేపథ్యంలో లక్ష్మణ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు ప్రజాస్వామ్య సంస్థల పరిరక్షణ, ఎన్నికల సమగ్రత గురించిన ఆందోళనలను తెలియజేయడానికే తమ చర్యలని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు.

సీఎంఆర్ఎల్ కేసు
: పినరయి విజయన్ కుటుంబానికి సుప్రీంకోర్టులో ఊరట

మొదటిపేజీ తరువాయి.. సీఎంఆర్ఎల్-ఎక్సాలాజిక్ అవినీతి కేసులో కేరళ మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రతిపక్ష నేత పినరయి విజయన్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. విజయన్, ఆయన కుమార్తె వీణ, అల్లుడు పీఏ మహమ్మద్ రియాస్‌లపై కేరళ విజిలెన్స్ విభాగం చేస్తున్న దర్యాప్తుపై వారం రోజుల పాటు స్టే విధిస్తూ అత్యున్నత న్యాయస్థానం ఈరోజు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దసరా సెలవుల సందర్భంగా ప్రత్యేకంగా సమావేశమైన జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ఎఫ్ఐఆర్‌ను సవాలు చేసేందుకు పిటిషనర్లకు అవకాశం నిరాకరిస్తూ కేరళ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు పక్కనపెట్టింది. ఈ కేసులో వారం రోజుల్లోగా హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించి అప్పీల్ చేసుకునేందుకు వారికి అనుమతి ఇచ్చింది. కోచిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) నుంచి వీణకు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ సంస్థకు ఎలాంటి సేవలు అందించకుండానే రూ. 2.78 కోట్లకు పైగా అక్రమంగా చెల్లింపులు జరిగాయనే ఆరోపణలపై ఈ కేసు నమోదైంది. ఈడీ ఇచ్చిన సమాచారం ఆధారంగా కేరళ విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ బ్యూరో (వీఏసీబీ) ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. అయితే, తాము ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయడం లేదని, కేవలం దర్యాప్తును మాత్రమే వారం పాటు నిలిపివేస్తున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తీరుపై కూడా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. "చట్టబద్ధమైన పరిమితులను దాటి జోక్యం చేసుకోవద్దు" అని హెచ్చరించింది. తదుపరి మధ్యంతర ఉత్తర్వులపై కేరళ హైకోర్టు స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవచ్చని తెలిపింది.

మా దేశంలో అస్థిరతకు భారత్ కుట్ర
: అజిత్ డోభాల్‌పై పాకిస్థాన్ ఆరోపణలు

నిత్యం నిఘా, న్యూ ఢిల్లీ : భారత్ తమ దేశంలో అస్థిరతను సృష్టించేందుకు ఉగ్రవాదాన్ని ఒక విధానంగా ఉపయోగిస్తోందని పాకిస్థాన్ తీవ్ర ఆరోపణలు చేసింది. లండన్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్ (ఐఐఎస్ఎస్)లో జరిగిన ఓ కార్యక్రమంలో పాకిస్థాన్ నేషనల్ కమాండ్ అథారిటీ సలహాదారు, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ మజర్ జమిల్ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. అక్టోబర్ 13న ఆయన చేసిన ప్రసంగానికి సంబంధించిన పూర్తి వివరాలు, రికార్డింగ్ తాజాగా బయటకు రావడంతో ఈ అంశం మరోసారి చర్చనీయాంశమైంది. "దక్షిణాసియాలో అణు నిరోధకత, వ్యూహాత్మక స్థిరత్వం" అనే అంశంపై ప్రసంగించిన మజర్ జమిల్.. భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్‌ను ప్రస్తావిస్తూ "డోభాల్ డాక్ట్రిన్"ను అమలు చేస్తూ పాకిస్థాన్‌ను బలహీనపరిచేందుకు భారత్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తెహ్రీక్-ఏ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ), బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) వంటి ఉగ్రవాద సంస్థలకు భారత్ మద్దతిస్తోందని ఆయన ఆరోపణలు చేశారు. 1971 బంగ్లాదేశ్ యుద్ధ సమయంలో ముక్తి వాహినికి, 1980లలో ఎల్టీటీఈకి భారత్ మద్దతు ఇచ్చిందని, అలాగే 2001-2014 మధ్య ఆఫ్ఘనిస్థాన్-పాకిస్థాన్ సరిహద్దులో అనేక కాన్సులేట్లను నడిపిందని ఆయన చారిత్రక ఉదాహరణలను ప్రస్తావించారు. భారత్ అణు విధానాన్ని కూడా జమిల్ తీవ్రంగా విమర్శించారు. భారత్ ప్రకటించిన 'నో ఫస్ట్ యూజ్' (మొదటగా అణ్వస్త్రాలను ప్రయోగించం) విధానం కేవలం ఒక దౌత్యపరమైన బూటకమని కొట్టిపారేశారు. గతేడాది 'ఆపరేషన్ సిందూర్' సమయంలో భారత్.. అణు, సంప్రదాయ వార్‌హెడ్‌లను మోసుకెళ్లగల బ్రహ్మోస్ క్షిపణులను ఉపయోగించిందని ఆరోపించారు. అయితే, బ్రహ్మోస్ కేవలం సంప్రదాయ వార్‌హెడ్‌లను మాత్రమే మోసుకెళ్లగలదని, అది వ్యూహాత్మక బలగాల పరిధిలోకి రాదని భారత వర్గాలు గతంలోనే స్పష్టం చేశాయి. భారత్‌కు న్యూక్లియర్ సప్లయర్స్ గ్రూప్ (ఎన్ఎస్జీ) మినహాయింపును అంతర్జాతీయ సమాజం సమీక్షించాలని జమిల్ డిమాండ్ చేశారు. పురాణాలను జాతీయ శక్తితో ముడిపెట్టే ప్రమాదకరమైన భావజాలం భారత సైనిక ఆలోచనా విధానంలో ఉందని, ఇది ఈ ప్రాంత భద్రతకు పెను ముప్పుగా పరిణమించిందని ఆయన వ్యాఖ్యానించారు. ఇరు దేశాల మధ్య కొంతకాలంగా ఉగ్రవాదం, అణు విధానాలపై ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఆఫ్ఘన్ గడ్డపై నుంచి తమపై దాడులు చేస్తున్న ఉగ్రవాదులకు భారత్ మద్దతిస్తోందని పాక్ ఆరోపిస్తుండగా.. తమ దేశంలో దాడులకు పాల్పడుతున్న ఉగ్రవాదులకు పాకిస్థాన్ ఆశ్రయం కల్పిస్తోందని భారత్ బలంగా వాదిస్తోంది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ వ్యూహాత్మక ప్రణాళికల విభాగానికి మాజీ అధిపతి అయిన జమిల్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.



హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో రహస్యాల లీక్..
- ఇద్దరు కీలక అధికారులపై విచారణ!

మొదటిపేజీ తరువాయి.. దేశంలోనే అతిపెద్ద ప్రైవేటు బ్యాంకుల్లో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో కీలక సమాచారం బయటకు వెళ్లినట్లు అంతర్గత విచారణలో వెల్లడైంది. బ్యాంకుకు చెందిన ఇద్దరు సీనియర్ అధికారులు వ్యాపార వ్యూహాలు, మార్కెట్‌పై ప్రభావం చూపగల సమాచారాన్ని బయటి వ్యక్తులకు చేరవేసినట్లు దర్యాప్తులో ఆధారాలు లభించాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ వ్యవహారంపై విచారణ ఇంకా కొనసాగుతోంది. బ్యాంకులోని కొన్ని కీలక విభాగాలకు బాధ్యత వహిస్తున్న ఈ అధికారులపై అనుమానాలు రావడంతో అంతర్గత విచారణ ప్రారంభించారు. సమాచారం దుర్వినియోగమైందా? దాని వల్ల బ్యాంకుకు లేదా మార్కెట్‌కు ఏమైనా నష్టం జరిగిందా? అనే అంశాలపై పరిశీలిస్తున్నారు. విచారణలో గుర్తించిన విషయాలను ఉన్నతాధికారులతో పాటు బోర్డులోని కొందరు సభ్యులకు ఈ ఏడాది ప్రారంభంలోనే తెలియజేసినట్లు సమాచారం. సంబంధిత అధికారులకు కూడా విచారణ వివరాలు అధికారికంగా తెలిపినట్లు తెలుస్తోంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధి అంతర్గత విచారణ జరుగుతున్న విషయాన్ని ధ్రువీకరించారు. అయితే, విచారణలో వెల్లడైన అంశాలు, ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల వివరాలపై స్పందించలేదు. విచారణ పూర్తయ్యాక వెల్లడయ్యే అంశాల ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నైతిక విలువలు, పాలనా ప్రమాణాల విషయంలో రాజీ పడబోమని బ్యాంకు స్పష్టం చేసింది. ఈ పరిణామం బ్యాంకుకు కీలకమైన సమయంలో చోటుచేసుకుంది. ఈ నెల 27న అనూప్ బాగ్చీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సీఈఓగా బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రత్యర్థి ఐసీఐసీఐ గ్రూపులో సుదీర్ఘ అనుభవం ఉన్న ఆయనకు ఈ పరిణామాలు సవాలుగా మారే అవకాశముంది. ఇటీవల బ్యాంకులో ఉన్నతస్థాయి మార్పులు కూడా చోటుచేసుకున్నాయి. మార్చిలో అప్పటి ఛైర్మన్ చక్రవర్తి వ్యక్తిగత విలువలకు, బ్యాంకులోని కొన్ని విధానాలకు మధ్య విభేదాలున్నాయని పేర్కొంటూ రాజీనామా చేశారు. అయితే, ఆందోళనలకు ఆధారాలు లేవని బ్యాంకు నియమించిన స్వతంత్ర న్యాయ సమీక్ష తెలిపింది. ప్రస్తుత సీఈఓ శశిధర్ జగదీశన్ మరోసారి పదవిలో కొనసాగేందుకు ఆసక్తి చూపలేదు. డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ కైజాద్ భరూచా కూడా డిసెంబరు చివర్లో వైదొలగాలని నిర్ణయించుకున్నారు.

దసరా పండుగ వేళ బంధించిన 4 పాలపిట్టలకు విముక్తి : సీపీ సజ్జనార్

మొదటిపేజీ తరువాయి.. దసరా పండుగ సందర్భంగా కొందరు స్వార్థపరులు బోనుల్లో బంధించిన తెలంగాణ రాష్ట్ర పక్షి 'పాలపిట్ట'లకు హైదరాబాద్ నగర పోలీసులు విముక్తి కల్పించారు. పౌరుల నుంచి అందిన పక్కా సమాచారంతో మూడు వేర్వేరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి, మొత్తం నాలుగు పాలపిట్టలను కాపాడినట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ వెల్లడించారు. దసరా పండుగ నాడు పాలపిట్టను చూడటం శుభసూచకంగా భావించే సంప్రదాయాన్ని కొందరు సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నించారు. మూగజీవాలను హింసిస్తే కఠిన చర్యలు తప్పవని ముందుగానే హెచ్చరించినా, కొందరు వాటిని పెడచెవిన పెట్టారు. లంగర్‌హౌస్ బాపూఘాట్ వద్ద ఓ ఆలయం దగ్గర రెండు పాలపిట్టలను, ఛత్రినాక శ్రీ చిత్రగుప్త స్వామి ఆలయం వద్ద ఒకటి, మంగళ్‌హాట్ బాలాజీనగర్ ఆలయం సమీపంలో మరో పాలపిట్టను బోనుల్లో బంధించి ఉంచారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి ఆయా ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. తీవ్ర యాతనకు గురవుతున్న నాలుగు పాలపిట్టలను స్వాధీనం చేసుకుని, వాటిని కేబీఆర్ పార్క్ అటవీ శాఖ అధికారులకు సురక్షితంగా అప్పగించారు. ఈ ఘటనలకు పాల్పడిన నిందితులపై అటవీ శాఖ అధికారుల సమన్వయంతో కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సజ్జనార్ తెలిపారు. "స్వేచ్ఛగా ఎగరాల్సిన పక్షిని పండుగ పేరుతో బంధించి, తిండి, నీరు లేకుండా హింసించడం ఎవరికీ మంచిది కాదు. బోనులోని పక్షి ఆర్తనాదాలతో శుభం ఎలా కనిపిస్తుంది? జీవుల పట్ల కరుణ చూపడమే నిజమైన భక్తి కానీ, ప్రకృతిని బంధించడం కాదు" అని ఆయన తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇలాంటి అమానవీయ చర్యలను ఎవరూ ప్రోత్సహించవద్దని, వన్యప్రాణులకు హాని తలపెట్టే ఘటనలు ఎక్కడ జరిగినా వెంటనే 18004255364, 9803338666 లేదా డయల్ 112కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



డ్రోన్ల ఆట కట్టించేందుకు ఆర్మీకి కొత్త రాడార్లు.. రూ.770 కోట్లతో ఒప్పందం

మొదటిపేజీ తరువాయి.. సరిహద్దుల్లో డ్రోన్ల ముప్పును సమర్థంగా ఎదుర్కొనేందుకు భారత సైన్యానికి కొత్త రాడార్లు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం రక్షణ మంత్రిత్వ శాఖ ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)తో రూ.770 కోట్ల విలువైన ఒప్పందం కుదుర్చుకుంది. ఇంప్రూవ్డ్ లో-లెవల్ లైట్‌వెయిట్ రాడార్ (LLLR-I) వ్యవస్థలను సమకూర్చుకోవడమే ఈ ఒప్పందం లక్ష్యం. ఈ రాడార్లు సైన్యం వైమానిక రక్షణ సామర్థ్యాన్ని పెంచనున్నాయి. ఈ రాడార్లతో యుద్ధ విమానాల పరిమాణంలో ఉండే లక్ష్యాలతో పాటు చిన్న, అతి చిన్న డ్రోన్లను గుర్తించి వాటి కదలికలను పర్యవేక్షించవచ్చు. గగనతలంలో గుర్తించిన లక్ష్యాల్లో ఏవి ఎక్కువ ప్రాధాన్యంతో ఎదుర్కోవాలో నిర్ణయించేందుకు కూడా ఈ వ్యవస్థ ఉపయోగపడుతుంది. దీంతో మానవరహిత వైమానిక వ్యవస్థల (యూఏఎస్) నుంచి ఎదురయ్యే ముప్పులను ఎదుర్కోవడంలో సైన్యానికి సహాయం అందనుంది. రక్షణ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. దేశీయ రక్షణ ఉత్పత్తుల తయారీని పెంచాలన్న లక్ష్యంలో భాగంగా ఈ కొనుగోలు చేపట్టినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. దీనివల్ల దేశీయ రక్షణ పరిశ్రమతో పాటు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్ఎంఈలు) కూడా అవకాశాలు పెరిగే వీలుంది. గత దశాబ్దంలో భారత్ రక్షణ ఉత్పత్తుల తయారీలో గణనీయమైన వృద్ధిని సాధించింది. అధికారిక గణాంకాల ప్రకారం.. 2013-14 ఆర్థిక సంవత్సరంలో రూ.4,746 కోట్లుగా ఉన్న రక్షణ ఉత్పత్తుల విలువ 2025-26లో రూ.1.78 లక్షల కోట్లకు చేరింది. అదే సమయంలో రక్షణ ఎగుమతులు రూ.686 కోట్ల నుంచి రూ.38,424 కోట్లకు పెరిగాయి. భారత రక్షణ పరికరాలు ప్రస్తుతం 80కి పైగా దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. 2029 నాటికి ఏటా రూ.3 లక్షల కోట్ల రక్షణ ఉత్పత్తుల తయారీ, రూ.50 వేల కోట్ల ఎగుమతులు సాధించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. రక్షణ రంగ పరిశోధన, అభివృద్ధికి కేటాయింపులను కూడా పెంచింది. 2026-27లో ఈ కేటాయింపులు రూ.29,100.25 కోట్లకు చేరాయి. పరిశ్రమలు, స్టార్టప్‌లు, విద్యాసంస్థలు కొత్త రక్షణ సాంకేతికతలను అభివృద్ధి చేసేందుకు పరిశోధన బడ్జెట్‌లో 25 శాతాన్ని అందుబాటులో ఉంచింది.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

వరంగల్ తూర్పు కాంగ్రెస్‌లో ఏం జరుగుతోంది?

- **డీసీసీ అధ్యక్షుడి ఆమోదం లేకుండానే డివిజన్ అధ్యక్షుల నియామకాలా?**
- **అధ్యక్షుల హోదాలో వెలిసిన బ్యానర్లతో పార్టీలో చర్చ**

వరంగల్ తూర్పు,అక్టోబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ తూర్పు కాంగ్రెస్ పార్టీలో డివిజన్ అధ్యక్షుల నియామకాల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడి ప్రమేయం లేకుండానే డివిజన్ అధ్యక్షులను నియమించారా? అన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఆయా డివిజన్లలో అధ్యక్షుల హోదాతో బ్యానర్లు వెలియడం ఈ చర్చకు కారణమైంది. మాజీ మంత్రి ముఖ్య అనుచరుడిగా చెప్పబడుతున్న ఓ నేత వ్యవహారశైలిపై పార్టీలో చర్చ జరుగుతున్నట్లు సమాచారం. డివిజన్ అధ్యక్షుల నియామకాలకు సంబంధించి పార్టీ అధికారికంగా నిర్ణయం తీసుకుందా? ఈ నియామకాలకు డీసీసీ అధ్యక్షుడి ఆమోదం ఉందా? లేక స్థానికంగా తీసుకున్న నిర్ణయాల ఆధారంగా బ్యానర్లు ఏర్పాటు చేశారా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటికే వరంగల్ తూర్పు కాంగ్రెస్‌లో నాయకుల మధ్య విభేదాలున్నాయనే ప్రచారం నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ నియమావళి ప్రకారం డివిజన్ అధ్యక్షుల నియామకాలు ఏ విధంగా చేపట్టారు? ఈ ప్రక్రియలో జిల్లా నాయకత్వం పాత్ర ఏమిటి? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. డివిజన్ అధ్యక్షుల నియామకాలపై కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకత్వం, రాష్ట్ర నాయకత్వం స్పందిస్తాయా? నియామకాలపై అధికారిక ప్రకటన వెలువడుతుందా? అన్నది వేచి చూడాలి. సంబంధిత నాయకుల వివరణ, పార్టీ అధికారిక ప్రకటన అందుబాటులోకి వస్తేనే ఈ వ్యవహారంపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



శివనగర్‌లో ఘనంగా విజయదశమి వేడుకలు

- **శమీ పూజ, ఆయుధ పూజ, కూష్మాండబలితో వైభవంగా దసరా ఉత్సవం**

వరంగల్, అక్టోబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):వరంగల్ నగరంలోని శివానగర్‌లో విజయదశమి దసరా ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ రామాలయం నుంచి సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమైన శమీ పూజ, ఆయుధ పూజ, కూష్మాండబలి కార్యక్రమాలు మంగళ వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా సాగాయి. స్థానిక ప్రజలు, ముఖ్యంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఉత్సవంలో భాగంగా కమిటీ అధ్యక్షుడు సుంచు మాధవ్ జమ్మి చెట్టుతో, ప్రధాన కార్యదర్శి దామరగిద్ద ప్రభాకర్ కూష్మాండంతో, కోశాధికారి మేరుగు అశోక్ ఖడ్గంతో ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం ఊరేగింపు శ్రీ రమా రహిత సత్యనారాయణ స్వామి దేవస్థానానికి చేరుకోగా, మేరుగు అశోక్ కూష్మాండబలి నిర్వహించారు. సుంచు మాధవ్ శమీ పూజ నిర్వహించడంతో దసరా ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు బైరి శ్యామ్, సుంచు కేశవ్, సహాయ కార్యదర్శులు రాసకచ్చుల రమేష్, దండు సమ్మయ్య, కార్యదర్శి గూడూరు మధుసూదన్, కార్యవర్గ సభ్యులు సుంచు భాగ్యమ్మ, బైరి బుచ్చమ్మ, బండారు జ్యోతి, బైరి ప్రభాకర్, నాంచార్ల బ్రహ్మచారి, సదనం శ్యామ్, దుండే జోగేందర్ పాల్గొన్నారు. అలాగే శ్రీ సత్య గణపతి ఉత్సవ యువజన కమిటీ, మహిళా యువజన కమిటీ సభ్యులు, 35వ డివిజన్ పద్మశాలి అధ్యక్షుడు గడ్డం రవి, బిల్ల రాజు, దండు అరుణ, దామెరగిద్ద హేమావతి, మార్త ఉష, గోగుల ఇందిర, కోతి స్వరూపతో పాటు వార్డులోని ప్రముఖులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



ఎల్‌నినో ప్రభావంతో నీటి, విద్యుత్ కొరత ముప్పు!

- **ప్రజలు ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలినీరు, విద్యుత్ పొదుపు ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత: ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి**

హన్మకొండ,అక్టోబర్ 21(నిత్యం నిఘా ప్రతినిధి): ప్రపంచవ్యాప్తంగా మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రానున్న రోజుల్లో నీటి ఎద్దడి, విద్యుత్ కొరత ఏర్పడే అవకాశం ఉందని వరంగల్ పశ్చిమ శాసనసభ్యుడు నాయిని రాజేందర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో తలెత్తే సమస్యలను ఎదుర్కొనేందుకు ప్రజలు ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. నీటి ప్రతి బొట్టును విలువైన వనరుగా భావించి, గృహ, వ్యాపార అవసరాల్లో నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని ఎమ్మెల్యే కోరారు. అదేవిధంగా అవసరం లేని సమయంలో దీపాలు, ఫ్యాన్లు, ఇతర విద్యుత్ పరికరాలను ఆపివేయడం ద్వారా విద్యుత్‌ను ఆదా చేయవచ్చని తెలిపారు. నీరు, విద్యుత్ పొదుపు కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు సామాజిక, నైతిక బాధ్యతగా భావించాలని స్పష్టం చేశారు. వనరులను వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవడం ద్వారా భవిష్యత్తు అవసరాలకు కొంతమేర సంసిద్ధంగా ఉండవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులను, భవిష్యత్తు తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలందరూ నీరు, విద్యుత్ పొదుపునకు ప్రాధాన్యమివ్వాలని, ఈ విషయంలో ప్రభుత్వానికి, అధికారులకు సహకరించాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.



రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పల్లవి విద్యార్థుల సత్తా

- **మహబూబాబాద్ జిల్లా జట్టుకు తృతీయ స్థానం.. నలుగురు విద్యార్థులకు పతకాలు**
- **అన్నారం షరీఫ్ విద్యార్థుల ప్రతిభకు ప్రశంసలు**

పర్వతగిరి, అక్టోబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో అన్నారం షరీఫ్ పల్లవి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. మహబూబాబాద్ జిల్లా బాలుర జట్టు తరపున బరిలోకి దిగిన పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు జట్టు తృతీయ స్థానం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కప్, పతకాలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈ నెల 18, 19 తేదీల్లో నల్లగొండ జిల్లా వలిగొండలో నిర్వహించిన ఐదో తెలంగాణ రాష్ట్ర సబ్‌జూనియర్ నెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మహబూబాబాద్ జిల్లా బాలుర జట్టు మూడో స్థానంలో నిలిచినట్లు పాఠశాల చైర్మన్ రాచకొండ అశోక చారి తెలిపారు. ఈ జట్టులో పల్లవి ఉన్నత పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థులు జె. రిషీంద్ర రెడ్డి, ఎం.డి. అర్మాన్ ఉల్ హక్, ఐదో తరగతి విద్యార్థులు కోటగిరి తన్విష్ గౌడ్, ఎం. రిషికేష్ మాధవ్ పాల్గొని తమ ప్రతిభను చాటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాచకొండ అశోక చారి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధనతో భవిష్యత్తులో జాతీయస్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయంపై పాఠశాల కరస్పాండెంట్ గంజి మహేందర్, డైరెక్టర్ కోటగిరి రమేష్, ప్రిన్సిపాల్ మేకల అశ్విని హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నెట్‌బాల్‌లో శిక్షణ అందించి, వారి ప్రతిభను వెలికితీసి విజయానికి దోహదపడిన వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రవణ్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు జట్టు స్ఫూర్తి, క్రమశిక్షణ, పట్టుదలతో విజయం సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి గర్వకారణంగా నిలిచారని యాజమాన్యం పేర్కొంది. భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో విజయాలు సాధించాలని విజేతలకు శుభాకాంక్షలు తెలిపింది.





అన్నారం షరీఫ్‌లో ఘనంగా దసరా పండుగ వేడుకలు

- **సర్పంచ్ గాడిపెల్లి మహేందర్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా వేడుకలు**



వరంగల్ /పర్వతగిరి,అక్టోబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి): పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ గ్రామంలో దసరా పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గాడిపెల్లి మహేందర్, పాలక మండలి ఆధ్వర్యంలో గ్రామంలోని బొడ్రాయి వద్ద దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. డీజే పాటల నడుమ గ్రామ ప్రజలు, యువకులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ పండుగ సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం రావణ దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని దసరా వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గాడిపెల్లి మహేందర్, ఉపసర్పంచ్ గొడుగు ఏకాంతం సారయ్య, వార్డు సభ్యులు సూరమంగమ్మ, సాయి మల్లు, గాడిపెల్లి రాజబాబు, ముంజంపల్లి నాగరాజు, రాపోలు అనిత–రవీందర్, కొండేటి కొమరమ్మ–రామచందర్, హస్తం రాధిక–సుధాకర్, దొంతమాల పవన్ కళ్యాణ్, బత్తిని జలంధర్, భాషబోయిన రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి నిమ్మల రాజు, కారోబార్ గుండ యాకయ్యతో పాటు గ్రామ ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదుకు యువత శ్రీకారం

- **అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలి**
- **గ్రామాలవారీగా అవగాహన కార్యక్రమాలకు కార్యాచరణ**



మల్లంపల్లి, అక్టోబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి): వరాబోయే వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో అర్హులైన పట్టభద్రులందరూ ఓటు హక్కు పొందేలా ములుగు జిల్లా మల్లంపల్లి మండలంలో యువత అవగాహన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా బుధవారం పలువురు పట్టభద్రులు సామూహికంగా ఓటరు నమోదు ప్రక్రియలో పాల్గొన్నారు. సాధారణ ఎన్నికల్లో ఓటరుగా నమోదై ఉన్నప్పటికీ, పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో ఓటు వేయాలంటే ప్రత్యేకంగా పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అర్హత కలిగిన పట్టభద్రులు ఈ ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పట్టభద్రుల ఓటు నమోదు ప్రాధాన్యంపై విస్తృత అవగాహన కల్పించేందుకు యువత కార్యాచరణ రూపొందిస్తోంది. రానున్న రోజుల్లో గ్రామాలవారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా కృషి చేయనున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యంలో పట్టభద్రుల ఓటు కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని యువత పిలుపునిచ్చింది.

మల్లూరులో వైభవంగా శ్రీ హేమాచల లక్ష్మీనృసింహస్వామి గ్రామసేవ

- **విజయదశమి సందర్భంగా స్వామివారు, అమ్మవార ఊరేగింపు.. జమ్మిపూజ నిర్వహణ**



మంగపేట, అక్టోబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి): విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరు గ్రామంలో శ్రీ హేమాచల లక్ష్మీనృసింహస్వామివారి గ్రామసేవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం నుంచి స్వామివారు, అమ్మవార్లు మల్లూరు గ్రామానికి బయలుదేరగా భక్తులు ఆధ్యాత్మిక ఆనందంలో మునిగిపోయారు. అనంతరం గ్రామంలోని విశ్రాంతి మండపం వద్ద బుధవారం సాయంత్రం 7.30 గంటలకు శమీపూజ (జమ్మిపూజ) కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయదశమి పర్వదినాన నిర్వహించిన ఈ పూజా కార్యక్రమంలో స్వామివారు, అమ్మవార్లను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

ఆదివరాహస్వామిని దర్శించుకున్న జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ దొనికెన రవి



పెద్దపల్లి జిల్లా / కమాన్‌పూర్, అక్టోబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి): కమాన్‌పూర్ మండల కేంద్రంలోని శ్రీ ఆదివరాహస్వామి ఆలయాన్ని పెద్దపల్లి జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ దొనికెన రవి బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, ప్రధాన అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ చరిత్ర, ఆధ్యాత్మిక ప్రాధాన్యత, ఆలయ విశిష్టతలను నిర్వాహకులు ఆయనకు వివరించారు. పవిత్ర ఆదివరాహస్వామి క్షేత్రాన్ని దర్శించుకోవడం సంతోషంగా ఉందని దొనికెన రవి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్లు బూస శ్రీనివాస్ గౌడ్, చాట్ల రాయమల్లు, కొంతం శ్రీనివాస్, ప్రధాన అర్చకులు వరప్రసాదాచార్యులు, మాజీ ఆలయ ధర్మకర్త దండే కనకరత్నం పాల్గొన్నారు.

అన్నారం షరీఫ్‌లో ఘనంగా దుర్గామాత నిమజ్జనం

- శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో వేడుకలు..
- పాల్గొన్న సర్పంచ్ గాడిపెల్లి మహేందర్, పాలకవర్గ సభ్యులు, గ్రామస్థులు



వరంగల్ జిల్లా / పర్వతగిరి, అక్టోబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి) పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ గ్రామంలో దుర్గామాత నిమజ్జన కార్యక్రమాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తుల జయజయధ్వానాల మధ్య అమ్మవారి విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. నిమజ్జన వేడుకలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గాడిపెల్లి మహేందర్, పాలకవర్గ సభ్యులు, యువజన నాయకులు, యువజన సంఘం సభ్యులు, బ్రాహ్మణులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మంథనిలో దుర్గాదేవి నిమజ్జనం

- భక్తిగీతాలు, జయజయధ్వానాల మధ్య అమ్మవారికి వీడ్కోలు పలికిన భక్తజనం



పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి): మంథని పట్టణంలో దుర్గాదేవి నిమజ్జన కార్యక్రమాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు అందుకున్న దుర్గామాతకు భక్తులు భక్తిపూర్వకంగా వీడ్కోలు పలికారు. అమ్మవారి నామస్మరణ, భక్తిగీతాలు, జయజయధ్వానాలతో పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని వివిధ రూపాల్లో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు, నిమజ్జన వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజల జీవితాల్లో శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని ప్రార్థించారు. భక్తుల జయజయధ్వానాల మధ్య దుర్గామాత నిమజ్జన కార్యక్రమం నిర్వహించడంతో నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని భక్తులు ఆకాంక్షించారు.

రంగశాయిపేటలో ఘనంగా రావణవధ వేడుకలు

- ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కొండా సురేఖ.. రావణ ప్రతిమకు నిప్పంటించిన గుండు సుధారాణి
- మిరుమిట్లు గొలిపిన బాణాసంచా.. ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

వరంగల్, అక్టోబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి) విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్ నగరంలోని రంగశాయిపేట మహంకాళి గుడి ఆవరణలో దసరా ఉత్సవ సమితి ఆధ్వర్యంలో రావణవధ వేడుకలను మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. మాజీ మంత్రి, వరంగల్ తూర్పు శాసన సభ్యురాలు కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరుకాగా, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ అధ్యక్షురాలు, మాజీ రాజ్యసభ సభ్యురాలు, గ్రేటర్ వరంగల్ మాజీ మేయర్ గుండు సుధారాణి రావణ ప్రతిమకు నిప్పంటించారు. అనంతరం వివిధ రకాల బాణాసంచా వెలుగులు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. దూపకుంట కరుణాకర్ కళాబృందం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దసరా ఉత్సవ సమితి అధ్యక్షుడు గుండు పూర్ణచందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొండా సురేఖ మాట్లాడుతూ ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమిని జరుపుకుంటామని పేర్కొన్నారు. రంగశాయిపేటలో ఇంత పెద్ద ఎత్తున రావణవధ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దసరా ఉత్సవ సమితి సభ్యులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. గుండు సుధారాణి మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయాన్ని



చాటిచెప్పే విజయదశమి పండుగ ప్రజల్లో స్ఫూర్తిని నింపుతుందన్నారు. రావణవధ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్న ఉత్సవ సమితి సభ్యులను అభినందిస్తూ ప్రజలందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి డాక్టర్ కంచ ప్రసాద్ మాట్లాడుతూ శ్రీరాముడు రావణుడిని సంహరించిన ఘట్టం చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. సీనియర్ పాత్రికేయుడు శంకేసి శంకర్ రావు మాట్లాడుతూ సుమారు 43 ఏళ్ల క్రితం రంగశాయిపేటలో స్థానిక పెద్దలు ప్రారంభించిన రావణవధ కార్యక్రమాన్ని నేటికీ కొనసాగించడం అభినందనీయమన్నారు. ఈ సమావేశంలో 42వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్, 41వ డివిజన్ మాజీ కార్పొరేటర్ పోశాల పద్మస్వామి, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ జనార్ధన్ ప్రసంగించారు. దసరా ఉత్సవ సమితి



ప్రధాన కార్యదర్శి దామెరకొండ కరుణాకర్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మీసాల ప్రకాష్, కాంగ్రెస్ నాయకుడు గోపాల నవీన్ రాజ్, ఉత్సవ సమితి కోశాధికారి కొక్కొండ భాస్కర్, ముఖ్య సలహాదారులు ముత్తినేని రామమూర్తి, మండల లక్ష్మయ్య, డాక్టర్ పోతు దర్శనం, బి.వి. రామకృష్ణ ప్రసాద్, మడుపోజు రామ్మూర్తి, ఉపాధ్యక్షులు పరికిపండ్ల రాజేశ్వర్ రావు, డాక్టర్ కోట శ్రీధర్ కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శులు బక్కి వంశీ, పాకాల మనోహర్, డాక్టర్ రేణికుంట్ల ప్రవీణ్, కార్యదర్శులు బజ్జూరి వీరేశం, పస్తం భిక్షపతి, కత్తెర పల్లి వేణు, కమిటీ సభ్యులు ఏలుగు అశోక్, అల్లం వీరస్వామి, దేవునూరి వెంకటేశ్వర్లు, గుండు నవీన్ కుమార్ పాల్గొన్నారు. అలాగే రామాలయం ధర్మకర్తలు ఆవునూరి కుమార్, విలాసాగరం శ్రీనివాస్, నాగమయ్య గుడి ధర్మకర్తలు శంకేసి అనిల్ కుమార్, వనం వేణు, మేరవాడ శివాలయం ధర్మకర్త పాలకుర్తి సుమన్, స్థానిక నాయకులు మంతెన సునీత, ఇటికాల అశోక్, బోలుగొడ్డు అనిల్ కుమార్, సయ్యద్ బషీర్, కర్ర కుమార్, వడ్డే శిరీష, ఉప్పునూతల శివ, మునుకుంట్ల విజయ, అంబటి రమతో పాటు మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుడి జ్ఞాపకారం 12 నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు

- తండ్రి సేవా స్ఫూర్తితో ముందుకొచ్చిన కుమారుడు, కోడలు

ములుగు జిల్లా/తాడ్వాయి, అక్టోబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి): పోలీస్ అమరవీరుడు భూక్య భీమ్ సింగ్ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు సామాజిక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ములుగు జిల్లా తాడ్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని 12 గ్రామ పంచాయతీలకు చెందిన 12 నిరుపేద కుటుంబాలకు నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలిచారు. భూక్య భీమ్ సింగ్ 1994 నుంచి 1996 వరకు తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించారు. విధి నిర్వహణలో ఉండగా 1996 సెప్టెంబర్ 23న మావోయిస్టులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో గాయపడిన ఆయన, మరుసటి రోజు సెప్టెంబర్ 24న ప్రాణాలు కోల్పోయి పోలీస్ అమరవీరుడిగా



నిలిచారు. తండ్రి చివరిగా విధులు నిర్వహించిన తాడ్వాయి ప్రాంత ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ఆయన కుమారుడు భూక్య రాజేష్, కోడలు భూక్య రోజీ క్రిస్టినా తమ ఆధ్వర్యంలోని మై హోమ్ ఆర్గనైజేషన్ ద్వారా ఈ సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అక్టోబర్ 21న తాడ్వాయి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, పోలీసుల సమక్షంలో నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా భూక్య రాజేష్, భూక్య రోజీ



క్రిస్టినా మాట్లాడుతూ తమ తండ్రి చివరిగా విధులు నిర్వహించిన ప్రాంత ప్రజలకు సేవ చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. ఆయన జ్ఞాపకార్థం నిరుపేద కుటుంబాలకు సహాయం అందించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమానికి సహకరించిన తాడ్వాయి పోలీసులకు, ఇతరులకు కృతజ్ఞతలు తెలిపారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి కుటుంబ సభ్యులు సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా నిరుపేదలకు అండగా నిలవడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.

తొమ్మిదో రోజుకు చేరిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె

- ఉద్యోగుల డిమాండ్లకు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు
- కనీస వేతనాలు, రూ.10 లక్షల ఆరోగ్య బీమా కల్పించాలి

వరంగల్, అక్టోబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి): జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కాంట్రాక్టు, పారుగు సేవల ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం తొమ్మిదో రోజుకు చేరుకుంది. వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్ కూడలిలో కొనసాగుతున్న సమ్మె శిబిరాన్ని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్టు, పారుగు సేవల ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏఐటీయూసీ అనుబంధ సంఘం నాయకుడు రామ రాజేష్ ఖన్నా సందర్శించి ఉద్యోగులకు సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. కాంట్రాక్టు, పారుగు సేవల ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని, ఆరోగ్య కార్డులు మంజూరు చేయడంతో పాటు రూ.10 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వైద్య, ఆరోగ్య సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకూడదని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. సమ్మె శిబిరంలో పాల్గొన్న ఉద్యోగులు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చే వరకు నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ టి. భరత్ కుమార్, హరికృష్ణ, డాక్టర్ సదానందం, డాక్టర్ హుస్సేన్, నర్సింగ్ అధికారులు కళ్యాణి, సుమలత, ఫార్మసీ అధికారి



తీగల సతీష్ కుమార్, ఎస్. అనిల్ కుమార్, సంతోష్, శివకుమార్, క్షయ వ్యాధి విభాగం సిబ్బంది రంజిత్, రాకేష్, జిల్లా చిన్నారుల ముందస్తు జోక్య కేంద్రం నిర్వాహకుడు మెర్గు అనిల్ కుమార్, శ్రవణ నిపుణురాలు వనజ, వైద్య సామాజిక కార్యకర్త మండల లావణ్య, అమూల్య, ప్రయోగశాల సాంకేతిక నిపుణురాలు మాధవి, ఏఎన్ఎంలు పెనీన, దాసరి నర్మద, రాజేశ్వరి, సంధ్య, ప్రభావతి, అనిత, శ్రీలత, ఎంఎన్ఓ ఏకుల చిరంజీవి, అజ్మీర విజయ నాయక్, బండి రాజేష్‌తో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

దళిత యువకుడిపై దాడి.. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- **మంత్రి శ్రీధర్‌బాబు చొరవ తీసుకుని బాధితుడికి న్యాయం చేయాలి**
- **ఇరుగురాళ్ల భాగ్యలక్ష్మి డిమాండ్**



పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి): కమాన్‌పూర్ మండలం నాగారం గ్రామపంచాయతీ పరిధిలోని లింగాల గ్రామానికి చెందిన దళిత యువకుడు అగ్గిమల్ల అనిల్‌పై జరిగిన దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డీసీఎంసీ సభ్యురాలు, ఉమెన్ రైట్స్ జాతీయ అధ్యక్షురాలు ఇరుగురాళ్ల భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాధితుడికి న్యాయం జరిగేలా రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవ తీసుకోవాలని కోరారు. పని నిమిత్తం రొంపికుంటకు వెళ్లిన అగ్గిమల్ల అనిల్‌పై మాడిశెట్టి ఆదిత్య పటేల్, సింధం సాయి ప్రణీత్‌తో పాటు మరో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బండరాళ్లతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడినట్లు ఆమె ఆరోపించారు. దళితులపై వివక్ష చూపడం సరికాదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. దళితుల హక్కుల పరిరక్షణ కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ దళిత సంఘాలను ఏకతాటిపైకి తీసుకువస్తుంటే, మరోవైపు కుల వివక్షతో దళితులను చిన్నచూపు చూడటం బాధాకరమని పేర్కొన్నారు. దళితులంతా ఐక్యంగా ఉండి తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలి

అనిల్‌పై జరిగిన దాడికి సంబంధించి దళిత గ్రామస్తులు కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు భాగ్యలక్ష్మి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేస్తామని, హత్యాయత్నం కేసు నమోదు చేసే అధికారం తమకు లేదని ఎస్ఐ చెప్పినట్లు బాధితుల తరఫున వారు పేర్కొన్నారని వివరించారు. అయితే, ఘటన తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సమగ్ర విచారణ జరిపి, వర్తించే చట్టాల ప్రకారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు హత్యాయత్నానికి సంబంధించిన కేసు నమోదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి బాధితుడికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. బాధితుడికి ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో చిప్పకుర్తి ఓదెలు, అగ్గిమల్ల నరసయ్య, నల్లాల మల్లేష్, నల్లాల లక్ష్మి, అగ్గిమల్ల సరోజన, చట్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- **ప్రజల రక్షణ కోసం ప్రాణాలర్పించిన వీరుల సేవలు మరువలేనివి**
- **వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత**



హనుమకొండ, అక్టోబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి): దేశ రక్షణతో పాటు ప్రజల ప్రాణాలు, ఆస్తుల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హనుమకొండలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ప్రాంగణంలో ఉన్న అమరుల స్తూపం వద్ద పోలీసు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతతో పాటు అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీసు అధికారులు పాల్గొని వీరుల సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైనికుల దాడిలో పది మంది కేంద్ర రిజర్వు పోలీసు దళం సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని, వారి వీరమరణానికి గుర్తుగా ప్రతి సంవత్సరం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల రక్షణ కోసం పోరాడిన అమరవీరుల ధైర్యం, కర్తవ్యనిష్ఠ, అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు.ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు పోలీసు శాఖ అందిస్తున్న సేవలు ఎంతో కీలకమని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు నిరంతరం అనేక సవాళ్లను ఎదుర్కొంటూ విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. నేరాల నియంత్రణ, మహిళలు, బాలల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం, మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని యువత దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

కమిషనరేట్ పరిధిలో 25 మంది పోలీసు అమరులు

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇప్పటివరకు విధి నిర్వహణలో 25 మంది పోలీసు అధికారులు, సిబ్బంది అమరులయ్యారని కమిషనర్ తెలిపారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసుల సేవలను ఎప్పటికీ మరువలేమన్నారు. వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజల భద్రత, సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులతో కమిషనర్ మాట్లాడి వారి సమస్యలను, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి పోలీసు శాఖ కట్టుబడి ఉందని, ప్రభుత్వంతో చర్చించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అమరవీరుల కుటుంబ సభ్యులకు బహుమతులు అందజేసి గౌరవించారు.ఈ కార్యక్రమంలో తూర్పు మండల డీసీపీ అంకిత్ కుమార్, అదనపు డీసీపీలు రాయల ప్రభాకర్‌రావు, బాలస్వామి, సురేష్, శ్రీనివాస్, ఏసీపీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలకు ఘన నివాళి

- **ప్రజా రక్షణలో ప్రాణాలర్పించిన 25 మంది పోలీసులకు స్మరణాంజలి**



హనుమకొండ, అక్టోబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా హనుమకొండలోని పోలీసు హెడ్‌క్వార్టర్స్ ప్రాంగణంలో బుధవారం అమరుల స్తూపం వద్ద పోలీసు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. దేశ రక్షణతో పాటు ప్రజల ప్రాణాలు, ఆస్తుల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, పోలీసు అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొని నివాళులర్పించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైనికుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పది మంది కేంద్ర రిజర్వు పోలీసు దళం సిబ్బంది వీరమరణానికి గుర్తుగా ప్రతి సంవత్సరం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన పోలీసుల ధైర్యం, కర్తవ్యనిష్ఠ, అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు.ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు పోలీసు శాఖ అందిస్తున్న సేవలు ఎంతో కీలకమని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, మహిళలు, బాలల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం, మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని యువత దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

కమిషనరేట్ పరిధిలో 25 మంది పోలీసు అమరులు

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇప్పటివరకు విధి నిర్వహణలో 25 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ప్రాణత్యాగం చేశారని కమిషనర్ తెలిపారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం అమరులైన పోలీసుల సేవలను ఎప్పటికీ మరువలేమని పేర్కొన్నారు. వారి స్ఫూర్తితో ప్రజల భద్రత, సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులతో కమిషనర్ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి పోలీసు శాఖ కట్టుబడి ఉందని, ప్రభుత్వంతో చర్చించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అమరవీరుల కుటుంబాలకు బహుమతులు అందజేసి గౌరవించారు.ఈ కార్యక్రమంలో తూర్పు మండల డీసీపీ అంకిత్ కుమార్, అదనపు డీసీపీలు రాయల ప్రభాకర్‌రావు, బాలస్వామి, సురేష్, శ్రీనివాస్, ఏసీపీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ ఎస్ఐగా ఉద్యోగం సాధించడం తొర్రూరుకు గర్వకారణం

- **యువత అన్ని రంగాల్లో రాణించాలి.. హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంగళపల్లి హుస్సేన్**



మహబూబాబాద్ జిల్లా / తొర్రూరు,అక్టోబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి): తొర్రూరు పట్టణానికి చెందిన పేర్ల ముఖేష్ కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్)లో ఎస్ఐగా ఉద్యోగం సాధించడం తొర్రూరు ప్రాంతంతో పాటు మహబూబాబాద్ జిల్లాకు గర్వకారణమని హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంగళపల్లి హుస్సేన్ అన్నారు. బుధవారం సంస్థ ఆధ్వర్యంలో నర్కుటి రామారాజు నిర్వహించిన అభినందన, సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖేష్‌కు మిఠాయి తినిపించి ఘనంగా సన్మానించారు. అనంతరం డాక్టర్ మంగళపల్లి హుస్సేన్ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలకు చెందిన యువత ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తూ అన్ని రంగాల్లో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బేడ బుడగ జంగాల సామాజిక వర్గం నుంచి మరింత మంది యువత ఉద్యోగాలు సాధించేలా చైతన్యం పెంపొందించాలని అన్నారు. యువతీ యువకులు పట్టుదలతో లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. తొర్రూరు సాయినగర్‌కు చెందిన పేర్ల దుర్గయ్య, సమ్మక్క దంపతుల కుమారుడైన ముఖేష్ ఉద్యోగం సాధించడం అభినందనీయమని పేర్కొంటూ, అతడిని ఉన్నతంగా తీర్చిదిద్దిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్కుటి రామారాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు గంధం లాలయ్య, బిక్షము, తూర్పాటి సాయి, నర్కుటి వెంకన్న, పస్తం ప్రసాదు, అల్లం మస్తాన్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మంథనిలో పోలీసు స్మారక దినోత్సవం.. అమరుల సేవలను స్మరించుకున్న పోలీసులు





పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆదేశాల మేరకు మంథని పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో బుధవారం అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలను స్మరించుకుంటూ మంథని పట్టణంలోని అమరవీరుల స్మారక స్తూపం వద్ద పూలమాలలు వేసి గౌరవ వందనం సమర్పించారు.మంథని ఎస్ఐ సందీప్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు అమరవీరులు అందించిన సేవలను, చేసిన త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.అమరవీరుల త్యాగాలు పోలీసు సిబ్బందికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు నిరంతరం సేవలందిస్తామని పోలీసులు ప్రతిజ్ఞ చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు అంకితభావంతో విధులు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

పండుగ సాయన్న ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి



మహబూబాబాద్ జిల్లా / తొర్రూరు, అక్టోబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):తె లంగాణ రాబిన్‌హుడ్‌గా పేరుగాంచిన పండుగ సాయన్న ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని బహుజనుల అభ్యున్నతికి కృషి చేయాలని మత్స్య పారి శ్రామిక సహకార సంఘాల మహబూబా బాద్ జిల్లా ముఖ్య ప్రచారకర్త కొత్తూరు రమేష్ పిలుపునిచ్చారు. పండుగ సాయన్న 166వ జయంతిని అక్టోబర్ 22న గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని కోరారు. బుధవారం తొర్రూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.1860 నుంచి 1900 మధ్య కాలంలో పండుగ సాయన్న పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజల నాయకుడిగా గుర్తింపు పొందారని రమేష్ తెలిపారు. పేదల పక్షాన నిలిచి, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. భూస్వాములు, పెత్తందారులు ఆయనపై కక్ష పెంచుకుని నిజాం పాలకుల ద్వారా అరెస్టు చేయించి హతమార్చారని ఆరోపించారు. ప్రజల కోసం పోరాడిన పండుగ సాయన్నను బందిపోటుగా చిత్రీకరించడం చారిత్రకంగా బాధాకరమని పేర్కొన్నారు.పండుగ సాయన్న పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకుని సామాజిక సమానత్వం, బహుజనుల అభ్యున్నతి కోసం ముందుకు సాగాలని రమేష్ సూచించారు. పండుగ సాయన్న జయంతిని అక్టోబర్ 22న అధికారికంగా నిర్వహించా లని నిర్ణయించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బహుజను లందరూ ఐక్యంగా జయంతి వేడుకల్లో పాల్గొని గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

విజయదశమితో ముగిసిన శ్రీ భద్రకాళీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

- **విజయదశమి రోజున అమ్మవారిని దర్శించుకున్న సుమారు 60 వేల మంది భక్తులు**
- **వైభవంగా చక్రస్నానం, ధ్వజావరోహణం.. భద్రకాళీ భద్రేశ్వరుల కల్యాణం**



వరంగల్ / భద్రకాళి ఆలయం , అక్టోబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):వరంగల్ నగరంలోని చరిత్ర ప్రసిద్ధి చెందిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు విజయదశమితో ముగిశాయి. బుధవారం ఉదయం నిత్యాహ్నిక కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం కలశో ద్వాసన, అమ్మవారికి సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించారు. అనంతరం చక్రతీర్థోత్సవం (చక్రస్నానం), ధ్వజావరోహణం జరిపారు. విజ యదశమి సందర్భంగా సుమారు 60 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు శమీ వృక్షానికి పూజలు నిర్వహించి, జమ్మి ఆకులను పరస్పరం పంచుకున్నారు.అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖుల్లో వరంగల్ పశ్చిమ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి, కాకతీయ పట్టణాభి వృద్ధి సంస్థ చైర్మన్ గుండు సుధారాణి, పోలీస్ కమిషనర్ శ్వేతా రెడ్డి, శాసన మండలి ఉపాధ్య క్షుడు డాక్టర్ బండా ప్రకాష్, దేవాదాయ శాఖ స్థపతి వల్లినాయగం తదితరులు ఉన్నారు. ఈ రోజు ఉభయదాతలుగా రత్న హోటల్ అధినే తలు పింగిళి సంపత్ రెడ్డి, సునీత దంపతులు వ్యవహరించారు.అదే రోజు మధ్యాహ్నం అమ్మ వారికి శతఘటాభిషేకం నిర్వహించారు. సాయంత్రం 7.30 గంటలకు దేవాలయ ప్రాంగ ణంలోని కల్యాణ మండపంలో శ్రీ భద్రకాళీ భద్రే శ్వరుల కల్యాణం వైభవంగా జరిగింది. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కల్యాణ మహోత్సవానికి ఉభయదాత లుగా మంచాల శ్రీకాంత్, కవిత దంపతులు, మంచాల నవీన్, స్వప్న దంపతులు, యాదా కిషన్, శోభ దంపతులు, రేగూరి ఆంజనే యులు, సరళ దంపతులు వ్యవహరించారు.పది రోజుల పాటు శ్రీ ధర్మకర్తలుగా కమటం వేణుగోపాల్, కల్లూరి పవన్ కుమార్, కటకం రాములు, కారెంగుల సురేష్ బాబు, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, చిదర అంజనీదేవి, మాడిశెట్టి సతీష్, పేరాల శ్రీనివా సరావు, రమేష్ చంద్ భంగ్, చింతలపణి వాసవి రెడ్డి, మోతుకూరి మయూరి, ఎక్స్ అఫీషియో సభ్యుడు పార్నంది నర్సింహామూర్తి తదితరులు ఉన్నారు.

అమరుల త్యాగాలకు వెలుగుల నివాళి



హనుమకొండ, అక్టోబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):దేశ భద్రత, ప్రజల రక్షణ, శాంతిభ ద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో బుధవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొని వీరులకు ఘన నివాళులర్పించారు.హనుమకొండలోని అశోక జంక్షన్ నుంచి ప్రారంభమైన కొవ్వొత్తుల ర్యాలీ పోలీస్ ప్రధాన కార్యాలయానికి చేరుకుంది. అక్కడ అమ రవీరుల స్థూపం వద్ద పోలీస్ అధికారులు, సిబ్బంది పుష్పాంజలి ఘటించి నివాళుల ర్పించారు.దేశం కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సాహసం, అంకిత భావం, సేవలను స్మరించుకోవడంతో పాటు, దేశ భద్రత కోసం పోలీసులు ఎదుర్కొం టున్న సవాళ్లను ప్రజలకు తెలియజేయడం ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, తూర్పు మండల డీసీపీ అంకిత్ కుమార్, అదనపు డీసీపీ (పరిపాలన) రాయల ప్రభాకర్ రావు, ఇతర అదనపు డీసీపీలు సురేష్, శ్రీనివాస్, ఏసీపీలు, సీఐలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ అధికారులు, సిబ్బంది, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల రక్షణలో అమరులైన పోలీసులకు ఘన నివాళి



ములుగు, అక్టోబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి): దేశ రక్షణతో పాటు ప్రజల ప్రాణాలు, ఆస్తుల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకాన్ అన్నారు. అమరవీరుల కుటుంబా లకు పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ములుగు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కార్య క్రమంలో ఆయన అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో పోలీస్ అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ విధి కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, ప్రజల పట్ల బాధ్యత, దేశం పట్ల నిబద్ధతతో కూడిన పవిత్రమైన కర్తవ్యమని పేర్కొన్నారు. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైనికుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పది మంది కేంద్ర రిజర్వ్ పోలీసు దళం సిబ్బంది త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు.నక్సలిజం, ఉగ్రవాదం నియంత్రణలో తెలంగాణ పోలీసులు అందించిన సేవలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయని అన్నారు. పోలీస్ శాఖ అనుసరిస్తున్న వ్యూహాలు, విధానాలు ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలిచాయని పేర్కొన్నారు. నక్సలిజం నిర్మూలన దిశగా పోలీసులు చేసిన కృషి ప్రశంసనీయమ న్నారు.యువతను సరైన మార్గంలో నడిపించేందుకు స్నేహపూర్వక పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఉద్యోగ మేళాలు నిర్వహించ డంతో పాటు, పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వ హిస్తున్నామని వివరించారు.విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎస్పీ భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులకు ఏవైనా సమస్యలు ఎదురైతే తనను నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు.అనంతరం ఏటూరునా గారం అదనపు ఎస్పీ మనన్ భట్ దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల వివరాలను చదివి వినిపిం చారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులకు బహుమతులు అందజేసి గౌరవించారు.ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం అదనపు ఎస్పీ మనన్ భట్, అదనపు ఎస్పీ సదానందం, జిల్లా నేర పరిశోధన విభాగం డీఎస్పీ కిషోర్ కుమార్, ములుగు డీఎస్పీ రవీందర్, సీఐలు దయాకర్, సురేష్, సూర్యప్రకాష్, రమేష్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు స్వామి, వెంకటనారాయణ, శ్రీకాంత్, తిరుపతి, ఎస్సైలు, రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పండుగ సందడి ముగిసింది.. పట్టణాలకు ప్రయాణికుల పరుగులు



హనుమకొండ, అక్టోబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి):దసరా, బతుకమ్మ పండుగల సందడి ముగియ డంతో సొంతూళ్లకు వచ్చిన ప్రజలు తిరిగి తమ పని ప్రాంతాలకు పయనమవుతు న్నారు. పండుగ సెలవులు ముగియడంతో బుధవారం హనుమకొండ ప్రధాన బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. గ్రామాల నుంచి కుటుంబ సమేతంగా వచ్చిన వారు తిరిగి పట్టణాలకు వెళ్లేందుకు బస్టాండ్‌కు చేరుకోవడంతో రద్దీ నెలకొంది.ముఖ్యంగా హైదరాబాద్, సికింద్రాబాద్ వెళ్లే బస్సుల కోసం ప్రయాణికులు పెద్ద సంఖ్యలో వేచి ఉండటంతో రద్దీ పెరిగింది. ప్రయాణికుల సంఖ్య గంటగంటకూ పెరుగుతుండటంతో ప్లాట్‌ఫారాలు కిక్కిరిసిపోయాయి. పండుగల అనంతరం ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. హైదరాబాద్ మార్గంలో ప్రయాణికుల అవ సరాలకు అనుగుణంగా అదనపు బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చారు.ప్రయాణికు లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, సిబ్బంది బస్టాండ్‌లోనే ఉండి రద్దీని పర్యవేక్షిస్తున్నారు. రద్దీ తగ్గే వరకు అదనపు బస్సు సర్వీసులను కొనసాగిస్తామని అధికారులు వెల్లడించారు. ప్రయాణికులు సహకరించి క్రమశిక్షణతో ప్రయాణాలు సాగిం చాలని సూచించారు.

దేశ భద్రత కోసం ప్రాణత్యాగం.. పోలీస్ అమరవీరులకు ఘన నివాళి




భూపాలపల్లి, అక్టోబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి): దేశ భద్రత, ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. పోలీస్ అమరవీరుల స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా పోలీస్ కార్యాల యంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్మృతి పరేడ్ నిర్వహించి అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని కూడా ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహ ణలో ప్రాణత్యాగం చేసిన 155 మంది పోలీస్ అమరవీరుల పేర్లను అదనపు ఎస్పీ నరేష్ కుమార్ చదివి వినిపించారు. అనంతరం అమరవీరులకు గౌరవ వందనం సమర్పించి పుష్పాంజలి ఘటించారు.ఈ సందర్భంగా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది మరింత నిబద్ధతతో ప్రజలకు సేవలందించాలని సూచించారు. అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు సమా జానికి ఎంతో కీలకమని అన్నారు. దేశం, సమాజం కోసం ప్రాణా లర్పించిన అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయక మని, వారి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను అంకితభా వంతో నిర్వర్తించాలని పేర్కొన్నారు.ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం పోలీసులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. అమ రవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.అనంతరం కార్యక్రమానికి హాజరైన అమరవీరుల కుటుంబ సభ్యులను ఎస్పీ పరామర్శించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారికి ధైర్యం చెబుతూ పోలీస్ శాఖ అన్ని వేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అమరవీరుల సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ పోలీసులు ముందుండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీలు సంపత్ రావు, సూర్యనా రాయణ, రెహమాన్, సీఐలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్లు, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సంఘం అధ్యక్షుడు నరేష్, అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

రామగుండం ఈఎస్ఐ ఆసుపత్రిపై ఎప్పుడు స్పష్టత

పెద్దపల్లి జిల్లా, అక్టోబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ప్రతిపాదిత ఉద్యోగుల రాష్ట్ర బీమా సంస్థ (ఈఎస్ఐ) ఆసుపత్రి ఏర్పాటుపై నెలకొన్న అనిశ్చితిని తొలగించాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన భూమి కేటాయింపు, ప్రభుత్వ అనుమతులు, నిధుల మంజూరు, నిర్మాణ పనుల పురోగతిపై పూర్తి వివరాలతో ఏడు రోజుల్లోగా నివేదిక అందించాలని కోరుతూ ఈ నెల 11న కలెక్టర్‌కు లేఖ రాశారు.రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో పనిచేస్తున్న కార్మికులు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు ఎంతో అవసరమని ఎంపీ పేర్కొన్నారు. ఈ అంశాన్ని గతంలో ఏప్రిల్ 8న కూడా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తన లేఖలో గుర్తుచేశారు.ప్రతిపాదిత ఆసుపత్రి కోసం భూమిని గుర్తించారా? గుర్తిస్తే సర్వే నంబరు, విస్తీర్ణం, స్థలం వివరాలు ఏమిటి? ఆ భూమిని ఉద్యోగుల రాష్ట్ర బీమా సంస్థకు అధికారికంగా కేటాయించారా? భూమి బదిలీ ప్రక్రియ పూర్తయిందా? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. జిల్లా యంత్రాంగం నుంచి ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలను సంబంధిత శాఖలకు ఏయే తేదీల్లో పంపించారో వివరించాలని సూచించారు.ఆసుపత్రి ఏర్పాటుకు అవసరమైన పరిపాలనా, ఆర్థిక అనుమతులు మంజూరయ్యాయా? మంజూరైతే సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య, తేదీలు, నిధుల కేటాయింపు వివరాలను వెల్లడించాలని ఎంపీ కోరారు. భూమికి సంబంధించి లేదా ఇతర శాఖల నుంచి పొందాల్సిన నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాలు ఏమైనా పెండింగ్‌లో ఉన్నాయా? ఉంటే వాటి వివరాలతో పాటు ఆసుపత్రి నిర్మాణ పనులు ఎప్పటిలోగా ప్రారంభమయ్యే అవకాశం ఉందో తెలియజేయాలని లేఖలో పేర్కొన్నారు.ప్రాజెక్టు ప్రస్తుతం ఏ దశలో ఉంది? ఏవైనా కారణాలతో ప్రక్రియ నిలిచిపోయిందా? అనే అంశాలపై సమగ్ర సమాచారం అందించాలని కోరారు. ఆసుపత్రి ఏర్పాటును వేగవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలు, సంబంధిత శాఖలతో జరిపిన సంప్రదింపులు, పెండింగ్ సమస్యల పరిష్కారానికి చేపట్టిన చర్యలతో కూడిన నివేదికను ఏడు రోజుల్లోగా సమర్పించాలని విజ్ఞప్తి చేశారు.రామగుండంలో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు పూర్తయితే పారిశ్రామిక కార్మికులు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.



అయితే భూమి కేటాయింపు, అనుమతులు, నిధుల మంజూరు, నిర్మాణ పనుల ప్రారంభంపై ఇంకా అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. ఎంపీ లేఖ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అందించే నివేదికతో ఆసుపత్రి ఏర్పాటులో ప్రస్తుత పరిస్థితి, తదుపరి కార్యాచరణపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

టీ.జీ.పీ.ఎస్.సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- **పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు : జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

నిత్యం నిఘా, సంగారెడ్డి, అక్టోబర్ 21 : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీ.జీ.పీ.ఎస్.సీ) ఆధ్వర్యంలో ఈ నెల 24న నిర్వహించనున్న కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు (సీబీటీ) పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.కాలుష్య నియంత్రణ మండలిలో అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్-II), అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి సంబంధించి పరీక్షల నిర్వహణపై టీ.జీ.పీ.ఎస్.సీ చైర్మన్ బుర్రా వెంకటేశం సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించి పలు సూచనలు చేశారు.కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలోని గీతం యూనివర్సిటీలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 24న అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్-II) పోస్టులకు సంబంధించి రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మొదటి సెషన్ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు. జిల్లాలో ఈ పరీక్షలకు మొత్తం 150 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.అభ్యర్థులు నిర్దిష్ట సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. మొదటి సెషన్‌కు ఉదయం 8.30 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారని, ఉదయం 9.30 గంటలకు గేట్లు మూసివేస్తారని తెలిపారు. రెండో సెషన్‌కు మధ్యాహ్నం 1 గంట నుంచి అనుమతిస్తారని, మధ్యాహ్నం 2 గంటలకు గేట్లు మూసివేస్తారని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఈ సమయాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, పుస్తకాలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించడంతో పాటు, కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పరీక్షలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా యువజన క్రీడల శాఖ ఇన్‌చార్జి అధికారి అఖిలేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం.. ప్రజల భద్రతకు నిరంతర సేవలు!

- **శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులదే కీలక పాత్ర: కలెక్టర్ దివాకర టి.ఎస్. — అమరవీరుల కుటుంబాలకు ఘన సత్కారం**

నిత్యం నిఘా, ఖమ్మం, అక్టోబర్ 21 : ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి విధులు నిర్వర్తించిన పోలీసు అమరవీరుల త్యాగాల ఫలితమే నేడు సమాజంలో కనిపిస్తున్న శాంతి, సౌభ్రాతృత్వమని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా బుధవారం ఖమ్మం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.స్మారక స్తూపం వద్ద ఘన నివాళులుజిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు స్మారక స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి వీరుల త్యాగాలను స్మరించుకున్నారు. తొలుత పోలీసు సాయుధ బలగాలు పరేడ్ నిర్వహించి గార్డ్ ఆఫ్ హానర్ సమర్పించాయి. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి అమరవీరుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. గార్డ్ ఆఫ్ హానర్ పరేడ్‌కు ఆర్ఐ శ్రీశైలం ఇన్‌చార్జిగా వ్యవహరించారు.శాంతిభద్రతల పరిరక్షణలోకీలక పాత్రఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ, దేశ రక్షణలో సైన్యం, ప్రజల శ్రేయస్సు కోసం పోలీసు శాఖ ప్రదర్శిస్తున్న నిబద్ధత, అంకితభావం, త్యాగాలు సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పునాదిగా నిలుస్తున్నాయని అన్నారు. జిల్లా పరిపాలన అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్న సమయంలో ప్రజలకు రక్షణ, భద్రత, భరోసా కల్పిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణలో పోలీసు శాఖ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తున్న పోలీసు సిబ్బందికి కుటుంబ సభ్యులు అందిస్తున్న సహకారం, వారు చేస్తున్న త్యాగాలను కూడా సమాజం గుర్తించాలని అన్నారు. పోలీసుల విధి నిర్వహణ వెనుక కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, సహకారం ఎంతో విలువైనవని తెలిపారు.ఃఅమరవీరుల త్యాగాలు పోలీసులకు స్ఫూర్తి: సీపీపోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా బలగాల దాడిలో 10 మంది భారతీయ పోలీసులు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. వారి అసమాన త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.తెలంగాణలో గతంలో తీవ్రవాదం కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోయారని, ప్రజలు భయాందోళనల మధ్య జీవించాల్సిన పరిస్థితులు ఉండేవని గుర్తుచేశారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోలీసులు చేసిన కృషి, త్యాగాల ఫలితంగా నేడు రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం నెలకొందని పేర్కొన్నారు.పోలీసు అధికారులు, అమరుల కుటుంబ సభ్యుల హాజరుఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏఆర్ డీసీపీలు కుమారస్వామి, విజయబాబు, ఏఆర్ ఏసీపీలు సుశీల్ సింగ్, నర్సయ్య, ఏసీపీలు రమణమూర్తి, మహేష్, సాంబరాజు, నర్సింహారావు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు హేమనాథ్, పలువురు సీఐలు, ఆర్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





వైఎస్సార్ నగర్ గుడిసెవాసులకు అండగా ఉంటాం

- **బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు: మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్**



హనుమకొండ, అక్టోబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి): వైఎస్సార్ నగర్‌లో నివసిస్తున్న గుడిసెవాసుల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన వైఎస్సార్ నగర్‌లోని బాధితులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి నివాసముంటున్న పేదల భూములపై కొందరు నేతలు, భూకబ్జాదారులు కన్నేశారని ఆరోపించారు. పేదలను భయభ్రాంతులకు గురిచేస్తూ, బెదిరింపులకు పాల్పడుతూ వారి నివాస స్థలాలను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. పేదల హక్కులను హరించే ప్రయత్నాలను సహించేది లేదని హెచ్చరించారు.ప్రభుత్వం వెంటనే స్పందించి వైఎస్సార్ నగర్‌లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న అర్హులైన పేదలకు పట్టాలు మంజూరు చేయాలని, వారికి పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ వారి పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.

పర్ణశాల పాఠశాలలో ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- **21 ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరిన 2005 పదో తరగతి విద్యార్థులు**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దుమ్ముగూడెం, అక్టోబర్ 21 (నిత్యం నిఘా ప్రతినిధి): దుమ్ముగూడెం మండలం పర్ణశాల గ్రామపంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. 21 ఏళ్ల తర్వాత నాటి సహాధ్యాయులంతా ఒకచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు.తమకు విద్యాబుద్ధులు నేర్పించి, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి పునాది వేసిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి, వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. తమ జీవితాల్లో గురువులు పోషించిన కీలక పాత్రను గుర్తు చేసుకుంటూ కృతజ్ఞతలు తెలిపారు.రెండు దశాబ్దాలకు పైగా విరామం తర్వాత పూర్వ విద్యార్థులంతా కలుసుకోవడంతో పాఠశాల ప్రాంగణంలో సందడి నెలకొంది. చిన్ననాటి అల్లరి, తరగతి గది అనుభవాలు, స్నేహబంధాలను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఇలాంటి సమ్మేళనాలు పాత స్నేహాలను మరింత బలోపేతం చేయడంతో పాటు గురువుల పట్ల గౌరవం, కృతజ్ఞతాభావాన్ని పెంపొందిస్తాయని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు.స్నేహానుబంధాలను చాటుతూ, గురువుల పట్ల గౌరవాన్ని చాటిచెప్పిన ఈ ఆత్మీయ సమ్మేళనం అందరిలోనూ ఆనందాన్ని నింపింది.

వికారాబాద్‌లో ఘనంగా రావణ దహన వేడుకలు

- **ముఖ్య అతిథిగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**





నిత్యం నిఘా, వికారాబాద్, అక్టోబర్ 21 : వికారాబాద్: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని వికారాబాద్ పట్టణంలోని బోనమ్మ గుంత ప్రాంగణంలో రావణ దహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసనసభాపతి, వికారాబాద్ శాసనసభ్యుడు గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. రావణ దహనాన్ని వీక్షించేందుకు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిర్వహించిన ఈ వేడుకలతో బోనమ్మ గుంత ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కు దసరా

శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు





నిత్యం నిఘా, సంగారెడ్డి, అక్టోబర్ 21 :
జమ్మి ఆకులు అందజేస్తూ.. ఆత్మీయ ఆలింగనాలతో విజయదశమి శుభాకాంక్షలువిజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో మర్యాదపూర్వకంగా కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు...ఎమ్మెల్యేను కలిసిన నాయకులు, కార్యకర్తలు జమ్మి ఆకులు అందజేసి, ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆత్మీయంగా మమేకమయ్యారు. జమ్మి ఆకులను పరస్పరం ఇచ్చిపుచ్చుకుంటూ, పెద్దల ఆశీస్సులు తీసుకుంటూ విజయదశమి శుభాకాంక్షలు తెలుపుకోవడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో ప్రత్యేకమైన భాగం...చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగను జరుపుకుంటామని, ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, ఆనందాలు నింపాలని ఆకాంక్షించారు...ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, ప్రతి కుటుంబంలో సిరిసంపదలు, శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించడమే కాకుండా ప్రజల మధ్య ప్రేమాభిమానాలను, ఆత్మీయతను మరింత పెంపొందిస్తాయని పేర్కొన్నారు...కార్యక్రమంలో పార్టీ నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దసరా పండగ వేళ తీవ్ర విషదం.

- **ఎదురు ఎదురు బైకులు ఢీ : ఒకరు మృతి మరొకరికి తీవ్ర గాయాలు.**



నిత్యం నిఘా, ఇల్లందు, అక్టోబర్ 21 :
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం ఎర్రాయిగూడెం స్టేజి వద్ద మంగళవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు, వర్స. వీరస్వామి (38)మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రతకు బైక్ పూర్తిగా ధ్వంసమైంది.ప్రమాదం జరిగిన తీరు:స్థానికులు మరియు పోలీసుల కథనం ప్రకారం.బోడు వైపు నుంచి వస్తున్న ఒక ద్విచక్ర వాహనం (బైక్), ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం (బైక్) ని బలంగా ఢీకొట్టింది. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ప్రమాదం జరిగిన సమయంలో బైక్ నడుపుతున్న వ్యక్తి హెల్మెట్ ధరించక పోవడంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ ద్వారా సమీపంలోని కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మార్గ మధ్యలో మరణించాడు. అని వైద్యులు తెలిపారు.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని ఎర్రయిగూడెం పంచాయతీ (చింతలకట్ట) కు చెందిన వర్స.వీరస్వామి గా గుర్తించారు. మృతుడికి భార్య ఇద్దరు కూతుర్లు ఉన్నారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్వగ్రామం కు తరలించారు. ఈ వార్త విన్న ఆ గ్రామంలో విషాయాలు అలుముకున్నాయి ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

దేవరయాంజాల్‌లో అంగరంగ వైభవంగా రావణాసురుడి దహనం

- **దాతల సహకారం.. మున్సిపల్ అధికారుల ఏర్పాట్లతో ఘనంగా విజయదశమి వేడుకలు**





నిత్యం నిఘా, శామీర్‌పేట, అక్టోబర్ 21 :
చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని శామీర్‌పేట డివిజన్ పరిధిలోని దేవరయాంజాల్ గ్రామంలో రావణాసురుడి దహన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. దాతల సహకారం, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయదశమి సంబరాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.విజయదశమి సందర్భంగా గ్రామ నడిబొడ్డున జెండా ఆవిష్కరించి, పాలపిట్టను వీక్షించారు. అనంతరం గ్రామంలోని శివాలయం, పోచమ్మ ఆలయం, వీర హనుమాన్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి వీర హనుమాన్ దేవాలయం సమీపంలోని మైదానంలో దాతల సహకారంతో రావణాసురుడి దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.దాతల సహకారం.. అధికారుల ఏర్పాట్లురావణాసురుడి దహన కార్యక్రమం నిర్వహణకు పలువురు దాతలు ఆర్థిక సహకారం అందించగా, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది విద్యుద్దీపాల అలంకరణతో పాటు ఇతర అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. అందరి సమష్టి సహకారంతో వేడుకలు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. విజయదశమి పండుగ నేపథ్యంలో గ్రామంలో పండుగ సందడి నెలకొంది.ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ సలహా మండలి సభ్యుడు బి. జైపాల్ రెడ్డి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి. మహిపాల్ రెడ్డి, అల్వాల్ సహకార సంఘం మాజీ సంచాలకుడు పి. సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచులు టి. లావణ్య శంకర్ గౌడ్, గోల్డ్ శ్రీనివాస్, శ్రీ సీతారామస్వామి దేవాలయ మాజీ అధ్యక్షులు డి. గోపాల్ రెడ్డి, పి. సుధాకర్ రెడ్డి, పి. లక్ష్మీనారాయణ, జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎన్. వై. అశోక్, మాజీ ఎంపిటీసీలు వి. సునీత లక్ష్మి, బి. కల్యాణి రాంమోహన్, పి. ఈశ్వరమ్మ, మున్సిపల్ మాజీ ఉపాధ్యక్షురాలు పి. వాణి వీరారెడ్డి, మాజీ కౌన్సిలర్ పి. నర్సింగ్ రావు గౌడ్, కె. నర్సింగ్ రావు, ఈ. ఉమా శ్రీనివాస్, బి. యాదమ్మ నర్సింగ్ రావు, రామాలయం మాజీ ధర్మకర్తలు ఏ. భారతి, వి. మురళి గౌడ్, జి. హరికృష్ణ, ఎన్. హరిగోపాల్, బి. కొండల్ రెడ్డి, టి. జగదీష్ గౌడ్, పి. నర్సింహారెడ్డి, బి. శ్రీనివాస్, బీజేపీ అధ్యక్షుడు పి. నర్సింహారెడ్డి, నాయకులు డాక్టర్ రామారావు, పి. ధర్మారెడ్డి, పి. కృష్ణారెడ్డి, పి. బాల్ రెడ్డి, బి. శ్రావంత్ రెడ్డి, బి. సత్యనారాయణ గౌడ్, ఎం. సాయి కుమార్, ఆర్. నాగరాజ్ గౌడ్, బి. జంగారెడ్డి, డి. మహేష్ గౌడ్, పి. మహిపాల్ రెడ్డి, బి. శంకర్, ఎస్. దుర్గయ్య, జె. శ్రీనివాస్, డి. ప్రకాష్ గౌడ్, ఈ. మహేందర్, జి. బాలకృష్ణ, ఎం. సాయికిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- **వారి ఆశయాలను కొనసాగించడం ప్రతి పోలీసు అధికారి బాధ్యత : కలెక్టర్ దీపక్ తివారి**



నిత్యం నిఘా, వికారాబాద్, అక్టోబర్ 21 : వికారాబాద్: విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయమని, వారి ఆశయాలను కొనసాగించడం ప్రతి పోలీసు అధికారి బాధ్యతని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం వికారాబాద్ జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో ఎస్పీ స్నేహ మెహ్రా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ భద్రత, ప్రజల రక్షణ కోసం ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం, సమాజం అండగా నిలవాలని అన్నారు. ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ, పోలీసులు నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు న్యాయం అందించాలని సూచించారు. అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.అనంతరం అదనపు ఎస్పీ రాజేశ్ మీనా 2025 సెప్టెంబర్ 1 నుంచి 2026 ఆగస్టు 31 వరకు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల పేర్లను చదివి వినిపించారు. కలెక్టర్, ఎస్పీ, పోలీస్ అధికారులు స్మారక స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు.పోలీస్ పతాక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో అధికారుల విభాగంలో కోట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు చెందిన మీనాక్షి మొదటి స్థానం, పెద్దేముల్‌కు చెందిన ఎం. ప్రశాంత్ వర్ధన్ రెండో స్థానం, పరిగికి చెందిన బి. మోహన కృష్ణ మూడో స్థానం సాధించారు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ స్థాయి విభాగంలో చెంగోముల్‌కు చెందిన జె. ప్రత్యూష మొదటి స్థానం, కరన్‌కోట్‌కు చెందిన బి. సంతోష్ రెండో స్థానం, మార్పల్లికి చెందిన సీహెచ్. దీపిక మూడో స్థానం సాధించారు.కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాజేశ్ మీనా, పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడు సుబ్బారావు పై బిఆర్ఎస్, సిపిఎం నాయకులు దాడి

- **7గురి మీద కేసు నమోదు**
- **కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు పైడిపల్లి, కర్నాటి**



నిత్యం నిఘా, బోనకల్, అక్టోబర్ 21 : కాంగ్రెస్ మండల నాయకులు మండల పరిధిలోని చొప్పకట్లపాలెం మాజీ సర్పంచ్ ఎర్రంశెట్టి సుబ్బారావు పై బి ఆర్ ఎస్, సిపిఎం కార్యకర్తలు కత్తితో దాడి చేశారని కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు పైడిపల్లి కిషోర్ కుమార్, మండల అధ్యక్షుడు కర్నాటి రామ కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..... చొప్పకట్లపాలెంలో ప్లెక్సీల వివాదంతో ప్రారంభమై చివరకు సుబ్బారావు పై హత్యా ప్రయత్నం వరకు బిఆర్ఎస్, సిపిఎం నాయకులు వెళ్లారని ఆరోపించారు. గ్రామంలో సోమవారం రాత్రి బతుకమ్మ ఊరేగింపు సందర్భంగా ఈ సంఘటన పథకం ప్రకారం జరిగిందని తెలిపారు. పోలీసుల సమక్షంలోనే ఈ సంఘటన జరిగిందని తెలిపారు. మండల కాంగ్రెస్ నాయకుడు పైనే హత్యాయత్నానికి పాల్పడితే తాము చూస్తూ ఊరుకోవాలా అంటూ వారు హెచ్చరించారు. ఈ విధంగా దాడులు చేస్తుంటే గ్రామాలలో కాంగ్రెస్ కార్యకర్తలకు రక్షణ ఎలా ఉంటుందన్నారు. ఇప్పటికైనా ఇటువంటి సంఘటనలకు పులిస్టాప్ పెట్టాలని లేకపోతే కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రతిదాడులకు దిగుతామని వారు హెచ్చరించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలతో గ్రామాలలో ప్రశాంత వాతావరణం కోసం తాము కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో కొంతమంది అరాచకవాదులుగా మారి అరాచకాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. గ్రామంలో కొంతమంది యువత డ్రగ్స్ అలవాటు పడి ఇటువంటి కార్యక్రమాలకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్, సిపిఎం ఆధ్వర్యంలో వేరువేరుగా బతుకమ్మ ఊరేగింపులు నిర్వహించారని తెలిపారు. అయితే కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మను చెరువులో నిమజ్జనం చేసి తిరిగి వస్తుండగా బి ఆర్ఎస్, సిపిఎం పార్టీలకు చెందినవారు అడ్డు తగిలి ఈ దాడికి పాల్పడ్డారని తెలిపారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఎర్రంశెట్టి సుబ్బారావు, తాళ్లూరు రామారావు, కందులు పాపారావు, బోయినపల్లి నరేష్, తదితరులు పాల్గొన్నారు. ఈ సంఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.7గురి మీద కేసు నమోదు చేసిన పోలీసులు బాధితుడి ఫిర్యాదు మేరకు కొండేటి గోపికృష్ణ, జొన్నలగడ్డ లక్షణమూర్తి, ఆది మల్ల ప్రవీణ్, కొనకంచి నాగరాజు, వడ్డే నరేష్, కిలార్ సురేష్, తన్నీరు పుల్లారావులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com